గోవాలోని మర్గావ్‌లో జరిగిన కాంగ్రెస్ గోయ్ రఖోన్ యాత్రలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ త్వరలోనే చట్టం ముందు నిలవాల్సి వస్తుందని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. కాంగ్రెస్ శ్రేణులతో కలిసి రెండు కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించిన ఆయన, ఓట్ల చోరీకి పాల్పడుతున్నారంటూ అధికార కూటమిపై విరుచుకుపడ్డారు. దేశంలో రాజ్యాంగాన్ని పరిరక్షించే ఏకైక శక్తి కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్, హరియాణా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బంగాల్, అసోం రాష్ట్రాల్లో ఓటు చోటు జరిగిందని స్పష్టమైన ఆధారాలతో సహా నిరూపించామని వెల్లడించారు. ప్రతిపక్షాల ఓట్లను తొలగించడం, అధికార పార్టీకి అనుకూలంగా కొత్త ఓట్లను చేర్చడం లాంటి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు ఓటర్లను మార్చడం, ఇతర రాష్ట్రాల నుంచి ఓటర్లను తీసుకురావడం వంటి కుట్రలు జరిగాయని రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఓటు చోటు విషయంలో ఇకపై ఎలాంటి సందేహాలకు తావులేదని, మోదీ తెరవెనుక ప్రణాళికలు రచిస్తుంటే అమిత్ షా వాటిని పర్యవేక్షించి అమలు చేస్తున్నారని రాహుల్ విమర్శించారు. ప్రధానమంత్రి ఓటు చోటుకు పాల్పడ్డారని తాము ఆరోపించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక కేసు నమోదు కాలేదని ఆయన గుర్తుచేశారు. ఈ అంశంపై కేసు పెడితే అది పూర్తిస్థాయి న్యాయపరమైన వ్యవహారంగా మారుతుందనే భయంతోనే పాలకులు వెనుకడుగు వేస్తున్నారని మండిపడ్డారు. తనపై నలభై ఐదుకు పైగా పరువునష్టం కేసులు ఉన్నాయని, వాటిలో మోదీ, అమిత్ షాలకు సంబంధించిన వ్యక్తులు దాఖలు చేసినవే ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎల్లప్పుడూ అత్యంత అప్రమత్తంగా ఉండి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గౌతమ్ అదానీ, ముఖేశ్ అంబానీల వంటి కొందరు బిలియనీర్లకు మేలు చేకూర్చేలా భారీ ప్రాజెక్టులు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. దేశంలోని మౌలిక సదుపాయాలు, భూములు, ఆర్థిక అవకాశాలను కార్పొరేట్ వర్గాలకు పంచిపెడుతూ ప్రతిఫలంగా రాజకీయ ప్రచార ప్రయోజనాలు పొందుతున్నారని రాహుల్ తీవ్రంగా విమర్శించారు. గోవా రాష్ట్రంలో రైతులు, పేదలకు చెందిన భూములు బలవంతంగా లాక్కొని బయటి వ్యక్తులకు అప్పగిస్తున్నారని రాహుల్ గాంధీ తీవ్రంగా ఆరోపించారు. ప్రాంతీయ మాస్టర్ ప్లాన్ రద్దు నేపథ్యంలో ప్రభుత్వానికి అత్యంత సన్నిహితులైన వారికి విలువైన భూములు కట్టబెట్టే ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. రాష్ట్ర సహజ సంపదను, సాంస్కృతిక వారసత్వాన్ని కేవలం స్వార్థ ఆర్థిక ప్రయోజనాల కోసం దారుణంగా ఉపయోగించుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోనే అత్యధిక నిరుద్యోగం ఉన్న రాష్ట్రంగా గోవా నిలిచిందని, సరైన ఉపాధి అవకాశాలు లేక యువత విదేశాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నరేంద్ర మోదీ హయాంలో గుజరాత్ అభివృద్ధి నమూనా గురించి గొప్పగా చెప్పేవారని, నేడు గోవాలో భయంకరమైన అవినీతి నమూనా మాత్రమే స్పష్టంగా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. దేశంలోని ప్రస్తుత విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, డబ్బు అధికారం లేనివారిని ఈ వ్యవస్థ పూర్తిగా పక్కన పెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. డబ్బున్నవారికే పెద్దపీట వేస్తూ ఆంగ్లంలో మాట్లాడలేని లక్షలాది మంది పేద విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు దక్కకుండా చేస్తున్నారని రాహుల్ విమర్శించారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా విద్యార్థులతో తాను జరిపిన సంభాషణ వీడియోను పంచుకుంటూ ప్రస్తుత ప్రభుత్వ విధానాలపై ప్రశ్నలు లేవనెత్తారు. దేశ యువతకు మేలు జరగాలంటే విద్యా ఉపాధి రంగాల్లో సమూల ప్రక్షాళన జరగాలని ఆయన బలంగా ఆకాంక్షించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపై ఉందని గుర్తుచేశారు. మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్ ఎంతటివారైనా తాము ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని రాహుల్ హెచ్చరించారు. ఈ అక్రమాలపై దేశవ్యాప్తంగా పోరాటం ఉధృతం చేస్తామని కాంగ్రెస్ అగ్రనేత స్పష్టం చేశారు. యువత భవిష్యత్తును కాపాడటానికి రాబోయే రోజుల్లో ప్రజా ఉద్యమాలను మరింత విస్తృతం చేస్తామని తేల్చిచెప్పారు. ఈ మొత్తం పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. దేశం ఎదుర్కొంటున్న ప్రజాస్వామ్య సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలని కోరారు. గోవా గడ్డపై జరిగిన ఈ సభ ద్వారా దేశ రాజకీయాల్లో నూతన చర్చకు తెరలేపారు. ఎన్నికల సంఘం పనితీరుపై వస్తున్న ఆరోపణలను మరోసారి జాతీయ స్థాయిలో ప్రముఖంగా చర్చకు తీసుకువచ్చారు. రానున్న కాలంలో కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు మరింత తీవ్రతరం కానున్నాయని ఈ యాత్ర స్పష్టం చేసింది.

## ఎన్యూమరేషన్ ఫారం ఇచ్చినా..

# జాబితాలో చోటేది?

**సిటీబ్యూరో:**



గ్రేటర్‌లో ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. బీఎల్ఓలు బాధ్యతారాహిత్యం కారణంగా వేలాది మంది తమ ఓటు హకును కోల్పోయే ప్రమాదంలో పడ్డారు. ఓటర్లు సక్రమంగా ఎన్యుమరేషన్ పత్రాలు సమర్పించినప్పటికీ, వాటిని ఆన్ లైన్‌లో అప్ లోడ్ చేయడంలో బీఎల్ఓలు విఫలమవుతున్నారు. ఓటర్లు అన్ని రకాల ఆధారాలతో దరఖాస్తులు అందించినా, జాబితాలో పేర్లు మాయమవుతుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. చిరునామాలు మారాయనే నెపంతో అర్హులైన ఓటర్లను సైతం ఏఎస్‌డీ (గైర్హాజరు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, మరణించినవారు , డూప్లికేట్ ఓటర్లు )జాబితాలోకి చేర్చు ఇదేమిటని ప్రశ్నిస్తే మళ్లీ కొత్త ఓటరుగా ఫారం6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలంటూ బీఎల్ఓలు ఉచిత సలహాలు ఇస్తున్నారని మలక్‌పేటకు చెందిన శ్రీనివాస్ తెలిపారు. కాగా గ్రేటర్‌లో సుమారు 10వేల పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. 38.94 లక్షల మంది ఓటర్లకు సంబంధించి నోటీసుల ప్రక్రియ కొనసాగుతున్నది. సుమారు 7.03 లక్షల మందికి నోటీసులు సిద్ధమైనప్పటికీ పంపిణీ జరగలేదనే ఆరోపణలు ఉన్నాయి. మరో 18 లక్షల మంది నుంచి నోటీసులకు సమాధానాలు రాలేదని చెబుతున్నారు. కాగా, మలక్‌పేటలో ఒకే ఇంట్లో ఉన్న నలుగురు ఓటర్లలో ఇద్దరికి నోటీసులు పంపి, మిగిలిన ఇద్దరికి ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. ఒకో పోలింగ్ బూత్ పరిధిలో సుమారు 300 మందికి పైగా ఓటర్లు ఇలాంటి సమస్యలను ఎదురొంటుండటం గమనార్హం. నోటీసులు అందిన వారు సరిగ్గా స్పందించలేదనే సాకుతో ఓట్లను పకన పెట్టేసేందుకు సిద్ధమవుతున్నారు. దీనివల్ల అర్హులైన ఓటర్లు తమ వాదన వినిపించుకునే ప్రాథమిక అవకాశాన్ని కూడా కోల్పోతున్నారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాల్సిన యంత్రాంగమే ఈ విధంగా ఏకపక్షంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య సూత్రాలకే విరుద్ధమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# కుంట్లూరులో బతుకమ్మ సంబరాల సందడి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఘన సన్మానం
- మల్‌రెడ్డి యువశక్తి ఆధ్వర్యంలో వేడుకలు
- జిఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి భారీ గజమాలతో సన్మానం
- బతుకమ్మ పోటీల విజేతలకు నగదు బహుమతుల ప్రదానం






**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కుంట్లూరు గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మల్‌రెడ్డి యువశక్తి, జీఎస్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కుంట్లూరు జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో నిర్వహించిన ఈ వేడుకలు మహిళలు, యువతుల కోలాహలం మధ్య పండుగ శోభను సంతరించుకున్నాయి. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మహిళలు ఆటపాటలతో సందడి చేయగా, ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. మల్‌రెడ్డి యువశక్తి కన్వీనర్లు మల్‌రెడ్డి స్నేహారెడ్డి, అభిషేక్‌రెడ్డి, జీఎస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గ్యారల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగ విశిష్టతను చాటిచెప్పేలా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా సంబరాలు జరుపుకున్నారు.

**ఎమ్మెల్యేకు భారీ గజమాలతో ఘన సన్మానం**

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని జీఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముందస్తు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను భారీ గజమాలతో ఘనంగా సన్మానించి, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

**బతుకమ్మ పోటీల విజేతలకు నగదు బహుమతులు**

మహిళల్లో ఉత్సాహాన్ని పెంపొందించడంతోపాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో బతుకమ్మ పోటీలను నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న మహిళలను ప్రోత్సహిస్తూ విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. మల్‌రెడ్డి యువశక్తి కన్వీనర్లు మల్‌రెడ్డి స్నేహారెడ్డి, అభిషేక్‌రెడ్డి ఆధ్వర్యంలో బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. పోటీల్లో ప్రథమ బహుమతిగా ఇద్దరికి రూ.15 వేల చొప్పున, ద్వితీయ బహుమతిగా ఇద్దరికి రూ.10 వేల చొప్పున, తృతీయ బహుమతిగా ఐదుగురికి రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు. బతుకమ్మ పోటీల్లో పాల్గొన్న మహిళలను ప్రోత్సహిస్తూ బహుమతులు అందించడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడానికి దోహదపడతాయని తెలిపారు. పండుగల ద్వారా ప్రజల మధ్య స్నేహభావం, ఐక్యత మరింత బలపడతాయని పేర్కొన్నారు.

**ప్రముఖుల హాజరు**

ఈ కార్యక్రమంలో మల్‌రెడ్డి స్నేహారెడ్డి, అభిషేక్‌రెడ్డి, జీఎస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గ్యారల శ్రీనివాస్‌గౌడ్, ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చామ సంపూర్ణ విజయశేఖర్‌రెడ్డి, అబ్దుల్లాపూర్మెట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బింగి దేవదాస్‌గౌడ్, కోటసింగారం రైతు సహకార సంఘం అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ సిద్ధాంకి కృష్ణారెడ్డి,లష్కర్ గూడ గ్రామ సర్పంచ్ అల్లె ఐలయ్య యాదవ్, హయత్ నగర్ రైతు సహకార సంఘం అధ్యక్షులు చామ కృష్ణారెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, రాష్ట్ర యువ నాయకులు చామ అను కిరణ్‌రెడ్డి, పాలడుగు నాగార్జున, షేక్ మహ్మద్ లాల్, మణికిరణ్, పాలడుగు నితిన్ తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బతుకమ్మ సంబరాలు, జన్మదిన వేడుకలు ఒకేసారి నిర్వహించడంతో కుంట్లూరులో పండుగ సందడి నెలకొంది.

## తార్నాక లో ఘనంగా దాండియా వేడుకలు



**సికింద్రాబాద్, విశాల భారతి :** తార్నాక గోకుల్ నగర్ లో ఘనంగా దాండియా వేడుకలు. దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని తార్నాక గోకుల్ నగర్‌లో నిర్వహించిన దాండియా కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్ర రెడ్డి ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక మహిళలతో కలిసి ఆమె దాండియా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, మహిళలు మరియు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## వెంకంపాడు గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాలు

- దివంగత సర్పంచ్ సోమన్న స్మృతిలో
- ఆయన తమ్ముడి ఆధ్వర్యంలో ఉత్సవాలు



**మరిపెడ విశాల భారతి:** మండలంలోని వెంకటంపాడు గ్రామపంచాయతీలో సద్దుల బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దివంగత గ్రామ సర్పంచ్ ఉప్పల సోమన్న తమ్ముడి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపాయి. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మల చుట్టూ ఆడిపాడుతూ సందడి చేశారు. దివంగత సర్పంచ్ సోమన్న కుటుంబం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించడం గ్రామస్థుల దృష్టిని ఆకర్షించింది. గ్రామంలో ఐక్యతను చాటుతూ సద్దుల బతుకమ్మ సంబరాలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.

## శ్రీకాంత్ మృతి కి కారణాలు సేకరిస్తున్న సిఐ ప్రతాప లింగం



**మోతె, విశాలభారతి:** ఆదివారం మండల పరిధిలోని విభాళ్ళ పురం గ్రామంలో శుక్రవారం రాత్రి దుర్గా మాత విగ్రహం వద్ద అన్నదానం చేయగా శనివారం ఉదయం 11 గంటలకు టెంటు గిన్నెలు కడుతున్న సమయంలో నిమ్మల శ్రీకాంత్ వయసు 28 పనస శ్రీలత భర్త పనస శ్రీనివాసు లకు స్వల్ప ఘర్షణ కావడంతో మాట మాట పెరిగి శ్రీలత శ్రీకాంత్ పై కర్రతో దాడి చేయగా శ్రీకాంత్ తలకు గాయమైంది శ్రీనివాస్ చేతులతో శ్రీకాంత్ పై పిడి గుద్దులు గుద్దగా గాయాల పాలు అయినా శ్రీకాంత్ శనివారం రాత్రి నిద్రిస్తుండగా సుమారు తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో పెడుసులు వచ్చి మృతి చెందినట్లు గ్రామస్తులు కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శ్రీకాంత్ మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా హాస్పిటల్ తరలించగా అనంతరం పోస్టుమార్టం లో శ్రీకాంత్ మృతికి కారణాలు తెలియవచ్చునని పోలీసులు తెలిపారు ఆదివారం ఘటన స్థలానికి మునగాల సీఐ ప్రతాప్ లింగం పోలీస్ సిబ్బందితో చేరుకొని గ్రామస్తులతో ఘటనా స్థలంలో ఘర్షణ జరిగిన సమయంలో ఉన్నవారితో వివరాలు సేకరించి విచారణ చేపట్టడం జరిగిందని ఎస్సై లచ్చిరెడ్డి చెప్పారు ఈ కార్యక్రమంలో మృతుని కుటుంబ సభ్యులు గ్రామస్తులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు కుటుంబ సభ్యులు

- కూకట్‌పల్లిలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



**కూకట్‌పల్లి,విశాలభారతి:** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు కూకట్‌పల్లిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో పండుగ సంబరాలను జరుపుకున్నారు. ఈ వేడుకల్లో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు దంపతులు, యామిని పాల్గొని బతుకమ్మ సంబరాల్లో భాగస్వాములయ్యారు. పూల పండుగగా ప్రసిద్ధి చెందిన బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పండుగ వాతావరణం ప్రతిబింబించింది. సాంప్రదాయ పాటలు, కోలాటాలు, బతుకమ్మ ఆటలతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని ఈ వేడుకలు చాటిచెప్పాయి.

## జగన్ నాయకులగూడెంలో బతుకమ్మ సంబరాలు



**విశాల భారతి గూడూరు:** గూడూరు మండలం జగన్నాయకులగూడెం విలేజ్ నందు సద్దుల బతుకమ్మ ఘనంగా ఆట పాటలతో జరుపుకున్నారు గ్రామ పెద్దలు పాల్గొన్నారు సర్పంచ్ రాధా సాగర్ మరియు వార్డు సభ్యులు పెనక ప్రమీల తాటి శ్రీను వెనక దేవేందర్ వెనుక వెంకటేశ్వర్లు వెనుక పృథ్వీరాజ్ మరియు యూత్ సభ్యులు పాల్గొన్నారు

## తాడిపర్తి ఎల్లమ్మ గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ

- తాడిపర్తి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నీలం రాములు



**విశాలభారతి, ఇబ్రహీంపట్నం:** యాచారం మండల పరిధిలోని తాడిపర్తి గ్రామంలో ఎల్లమ్మ తల్లి గుడి నిర్మాణానికి ఎదురవుతున్న అడ్డంకులపై తాడిపర్తి గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నీలం రాములు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి స్పందిస్తూ,గుడి నిర్మాణం ఎలాంటి ఆటంకం లేకుండా జరిగేలా అధికారులకు సూచిస్తానని భక్తుల మనోభావాలను దెబ్బతీయకుండా యధావిధిగా గుడి నిర్మాణం జరుపుకోవాలని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తాడిపర్తి గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నీలం రాములు మాజీ సర్పంచ్ దూస రమేష్,యాచారం మహేష్,యాచారం అంజయ్య ముప్పిడి మల్లారి తదితరులు పాల్గొన్నారు.

## దసరా పండుగ సందర్భంగా గ్రామానికి దీపాల వెలుగులు

- మూడు హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- రూ.6 లక్షల వ్యయంతో మూడు హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



ఐమాక్స్ లైట్ లను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..

**విశాలభారతి,షాద్ నగర్:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో దసరా పండుగ సందర్భంగా గ్రామానికి దీపాల వెలుగులు నింపారు. మూడు హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దాదాపు రూ.6 లక్షల వ్యయంతో మూడు హైమాస్ట్ లైట్ల ఏర్పాటు చేశారు. లింగారెడ్డి గూడ గ్రామంలో దసరా పండుగ శుభ సందర్భంగా ఏర్పాటు చేసిన మూడు హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే లాంఛనంగా అట్టహాసంతో వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. గ్రామంలో వెలుగులు నింపేందుకు దాదాపు రూ.6 లక్షల వ్యయంతో ఈ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చల్లా శ్రీకాంత్ రెడ్డి, ఫరూక్‌నగర్ మండల పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర రెడ్డి, గ్రామ సర్పంచ్ ఎంసీ ప్రవీణ్ కుమార్, గ్రామ ఉపసర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ తదితరులున్నారు.

## ప్రైవేట్ ఎస్టీపీల నమోదుకు అక్టోబర్ 25 తుది గడువు

- 600 ఎస్టీపీలకు గాను ఇప్పటివరకు 61 మాత్రమే నమోదు.. గడువులోగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** హైదరాబాద్ మహానగర జలమండలి పరిధిలోని ప్రైవేట్ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల (ఎస్టీపీలు) యాజమాన్యాలు ఈ నెల 25వ తేదీలోగా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నాగోల్ సర్కిల్ 11, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ ఏ. సంపత్ కుమార్ సూచించారు. ప్రైవేట్ ఎస్టీపీల నమోదుకు గడువు సమీపిస్తున్నందున ఇప్పటివరకు నమోదు చేసుకోని యాజమాన్యాలు వెంటనే ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. జలమండలి పరిధిలో సుమారు 600 ప్రైవేట్ ఎస్టీపీలు ఉన్నట్లు అంచనా వేయగా, ఇప్పటివరకు కేవలం 61 మాత్రమే నమోదు చేసుకున్నాయని తెలిపారు. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, ఇతర ప్రైవేట్ సంస్థల్లో ఏర్పాటు చేసిన ఎస్టీపీల యాజమాన్యాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎస్టీపీల సామర్థ్యం, రోజువారీ శుద్ధి చేస్తున్న మురుగునీటి పరిమాణం, శుద్ధి చేసిన నీటి వినియోగం, మిగులు నీటి లభ్యత వివరాలను సేకరించేందుకు ఈ నమోదు ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. రానున్న వేసవిలో తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించేందుకు శుద్ధి చేసిన నీటిని నిర్మాణ రంగం, పరిశ్రమలు, ఉద్యానవనాల నిర్వహణ వంటి తాగునీరు అవసరం లేని కార్యకలాపాలకు వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రైవేట్ ఎస్టీపీల్లో అందుబాటులో ఉన్న మిగులు శుద్ధి నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని వివరించారు. ప్రైవేట్ ఎస్టీపీల యాజమాన్యాలు జలమండలి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

## సపావట్ సోమ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు

- బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు గుగులోతు రవినాయక్
- సపావట్ రాజు కుటుంబానికి నాయకుల పరామర్శ



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** కురవి మండలంలోని పోలంపల్లి తండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు సపావట్ రాజు నాయనమ్మ సపావట్ సోమ్లి దశదిన కర్మ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు గుగులోతు రవినాయక్, కంచర్లగూడెం గ్రామ సర్పంచ్ బానోత్ రమేష్, ఉపసర్పంచ్ బానోత్ గణేష్, యువ నాయకులు రవి, సాయి, శ్రీను, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులారా.. మీ ఓటే మీ బలం!

- అర్హులైన ప్రతి పట్టభద్రుడూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలి
- గతంలో ఓటు ఉన్నా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి
- నవంబర్ 6 చివరి గడువు
- కాంగ్రెస్ పార్టీ జిల్లా యువ నాయకులు గార్లపాటి భరద్వాజ్ రెడ్డి పిలుపు



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** పట్టభద్రుల హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అర్హులైన పట్టభద్రులంతా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా యువ నాయకులు భరద్వాజ్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఆ హక్కును సద్వినియోగం చేసుకోవాలంటే ముందుగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా ప్రతి ఎన్నికకు ముందు కొత్తగా రూపొందిస్తారని, గతంలో ఓటు హక్కు కలిగి ఉన్నవారు సైతం ఈసారి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా యువ నాయకులు గార్లపాటి భరద్వాజ్ రెడ్డి సూచించారు. నవంబర్ 6, 2026లోగా అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని, చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించేందుకు, నిరుద్యోగ యువత, ఉద్యోగులు, విద్యావంతుల హక్కుల కోసం తమ ప్రతినిధిని ఎన్నుకునేందుకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు కీలకమని ఆయన పేర్కొన్నారు. డిగ్రీలు పూర్తి చేసిన యువత, వైద్యులు, ఉద్యోగులు తమ ఓటు నమోదుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఓటు నమోదు విషయంలో నిర్లక్ష్యం వహించి ప్రజాస్వామ్య హక్కును కోల్పోవద్దని కాంగ్రెస్ పార్టీ జిల్లా యువ నాయకులు గార్లపాటి భరద్వాజ్ రెడ్డి కోరారు. అర్హులైన పట్టభద్రులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహోద్యోగులకు అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చొరవ చూపాలని పిలుపునిచ్చారు. పట్టభద్రులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. "ఓటు మన హక్కు.. దాన్ని వినియోగించుకోవడం మన బాధ్యత. అర్హత కలిగిన ఏ ఒక్క పట్టభద్రుడూ ఓటు హక్కుకు దూరం కాకూడదు. ప్రతి పట్టభద్రుడు చైతన్యంతో ముందుకొచ్చి గడువులోగా ఓటరుగా నమోదు చేసుకోవాలి. పట్టభద్రుల సమస్యలకు ప్రాతినిధ్యం లభించాలంటే ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం" అని కాంగ్రెస్ పార్టీ జిల్లా యువ నాయకులు గార్లపాటి భరద్వాజ్ రెడ్డి స్పష్టం చేశారు.

## 1000 రోజులు గడిచినా వికలాంగుల పెన్షన్ పెంపు ఎక్కడ?

- దసరా పండుగ వేళ కూడా ఎదురుచూపులేనా?



**దేవరుప్పుల, విశాలభారతి:** ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 1000 రోజులు గడుస్తున్నా వికలాంగుల పెన్షన్ పెంపుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరం. ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలు నెరవేరుతాయని ఆశించిన దివ్యాంగులు నేటికీ ఎదురుచూపుల్లోనే ఉన్నారు. దసరా వంటి పెద్ద పండుగ వచ్చినా తమ జీవితాల్లో ఆర్థిక భరోసా లేకపోవడం వికలాంగులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.ప్రస్తుత ధరల పెరుగుదల నేపథ్యంలో నిత్యావసర సరుకులు, మందులు, వైద్య ఖర్చులు, ఇతర జీవన అవసరాలను తీర్చుకోవడం వికలాంగులకు భారంగా మారింది. ఇప్పటికే అనేకమంది వికలాంగులు ఇతరులపై ఆధారపడుతూ, ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పెన్షన్ పెంపు కోసం ఎదురుచూడాల్సి రావడం విచారకరం.వికలాంగుల సంక్షేమం మాటలకే పరిమితం కాకూడదు.. ఆచరణలో కనిపించాలి. వికలాంగులకు నెలకు ₹6,000 పెన్షన్ అందించాలనే డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకోవాలి. అలాగే వికలాంగులకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, ఉపాధి అవకాశాలు, వైద్య సహాయం, విద్యా మరియు ఇతర సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి.దసరా పండుగను ఆనందంగా జరుపుకోవాల్సిన వికలాంగులు పెన్షన్ పెంపు కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. వారి నిరీక్షణకు ముగింపు పలికి, ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

## జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్‌కు పూర్వవైభవం

- సేవే లక్ష్యంగా నిరుపేదలకు అండగా జ్యోతి యూత్
- గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు
- చదువు క్రీడలు అసోసియేషన్ కృషి
- జ్యోతి యూత్ అసోసియేషన్ అధ్యక్షులు నూకం కృష్ణ

**విశాలభారతి ఇబ్రహీంపట్నం:** జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ కు పూర్వ వైభవం తెచ్చిన యూత్ అధ్యక్షులు నూకం కృష్ణ. 2025-2026లో సేవా కార్యక్రమాలు, విద్యాభివృద్ధి, క్రీడల ప్రోత్సాహం, గ్రామాభివృద్ధికి విశేష కృషి నందివనపర్తి జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు నూకం కృష్ణ 2025-2026 సంవత్సరంలో అసోసియేషన్‌కు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. పేదల సంక్షేమం, విద్యార్థుల అభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణ, క్రీడల ప్రోత్సాహం, గ్రామ సమస్యల పరిష్కారం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ముందుకు సాగుతున్నారు. గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 50 కిలోల బియ్యం పంపిణీ చేసి పేదలకు అండగా నిలిచారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. సంగం సత్తయ్య సార్ వర్ధంతి సందర్భంగా యాచారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేపట్టారు. జ్యోతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు బ్లాంకెట్లు పంపిణీ చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సత్కారం విద్యార్థులకు బహుమతులు విద్యారంగంలో విశేష సేవలందిస్తూ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా గుర్తింపు పొందిన పీడీ/పీటీఈ శ్రీనివాస్ సార్‌ను జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేసి వారిని అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మరిన్ని అవకాశాలు కల్పించాలని అసోసియేషన్ కృషి చేస్తోంది. ఉపాధ్యాయులను గౌరవించడం, విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా విద్యాభివృద్ధిలో తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తోంది. క్రీడలకు ప్రోత్సాహం యువతలో ఐక్యత గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు గ్రామాల మధ్య స్నేహభావం, ఐక్యతను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో సంగం సత్తయ్య సార్ స్మారక జిల్లా గ్రామీణ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశాన్ని కల్పించారు.



**విద్యాభివృద్ధే ప్రధాన లక్ష్యం**

నందివనపర్తి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా మార్చాలనే లక్ష్యంతో అసోసియేషన్ అధ్యక్షులు నూకం కృష్ణ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ విషయమై ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ని, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. గ్రామీణ విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. నందివనపర్తి పాఠశాలను పబ్లిక్ స్కూల్‌గా మార్చే అంశంపై సానుకూల స్పందన లభించిందని, ఈ లక్ష్యం త్వరలో నెరవేరుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థులకు ఉపయోగపడేలా నిర్మిస్తున్న లైబ్రరీ భవనానికి అదనపు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ని కలిసి విజ్ఞప్తి చేశారు. గ్రామీణ విద్యార్థులకు చదువుకునేందుకు మెరుగైన వాతావరణం కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

**ప్రజల్లో అవగాహన గ్రామ సమస్యలపై ప్రత్యేక దృష్టి**

ప్రజలకు సంబంధించిన కీలక అంశాలపై గ్రామస్థులకు, యువతకు అవగాహన కల్పించడంలోనూ అసోసియేషన్ ముందుంది. ఎస్ఐఆర్‌పై గ్రామీణ ప్రజలకు, యువతకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో పందుల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, నష్టాలను ప్రజలకు వివరించడంతో పాటు పందుల పెంపకందారులకు హెచ్చరికలు జారీ చేశారు. గ్రామంలో బెల్టు షాపుల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, గ్రామాభివృద్ధి కోసం అవసరమైన చర్యలు చేపట్టడం వంటి అంశాల్లో ముందుండి పనిచేస్తున్నారు.

# రాయికల్ టోల్ ప్లాజా వద్ద భారీగా ట్రాఫిక్ జామ్!

- హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాల బారులు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో పోలీసులు

**విశాల భారతి,షాద్‌నగర్:** షాద్‌నగర్ సమీపంలోని రాయికల్ టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ కొనసాగుతోంది. హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీకెండ్‌తో పాటు పండుగ సీజన్ కావడంతో ఒక్కసారిగా వాహనాల సంఖ్య పెరగడంతో టోల్ ప్లాజా వద్ద రద్దీ నెలకొంది.సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగి అదనపు లేన్లను తెరిచి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపడుతున్నారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని,ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని వీలైనంతవరకు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఫోటో రైటప్:టోల్ గేట్ వద్ద ఏర్పడ్డ ట్రాఫిక్ జామ్..

# భవానీ మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

- ఎలికట్ట భవానీ మాత ఆలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక పూజలు
- పల్లకీ సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే



**విశాలభారతి, షాద్‌నగర్:** భవానీ మాత కృపాకటాక్షాలతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, షాద్‌నగర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆకాంక్షించారు. ఎలికట్ట గ్రామంలోని శ్రీ భవానీ మాత ఆలయాన్ని సందర్శించిన ఆయన, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్‌తో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి పల్లకీ సేవలో పాల్గొని ప్రజల సంక్షేమం కోసం ప్రార్థించారు. ఎలికట్టలోని శ్రీ భవానీ మాత ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్‌లకు ఆలయ నిర్వాహకులు, భక్తులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించారు. పల్లకీ సేవలో పాల్గొని భక్తిభావాన్ని చాటుకున్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, నియోజకవర్గంలో ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నవకిరణి నర్సింహ, పట్టణ సీఐ సీతారాం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, గిరిజన ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్, మాజీ ఎంపీపీ మంచనపల్లి శివశంకర్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్య యాదవ్, సింగిల్ విండో చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, ఫరూఖ్‌నగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు చెంది తిరుపతి రెడ్డి, పురుషోత్తం రెడ్డి, అంబటి ప్రభాకర్, శ్రీశైలం, తాలూకా ఎస్సీ సెల్ చైర్మన్ జాంగారి రవి, లింగారెడ్డిగూడ ఉపసర్పంచ్ ఎర్రోళ్ల అశోక్, మనీష్, నీరటి వాసు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫోటో రైటప్:భవాని మాత ఆలయంలో పల్లకి సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

# కోత్తూరు జీలో బతుకమ్మ సంబరాల జాతర!

- సర్పంచ్ మలోతు నరేష్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా పూల పండుగ
- ఆటపాటలతో పల్లెలో పండుగ శోభ
- తెలంగాణ సంస్కృతికి సంప్రదాయబద్ధంగా నీరాజనం



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాల వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కోత్తూరు జీ గ్రామంలో అంగరంగ వైభవంగా జరిగింది. మహబూబాబాద్ జిల్లా, డోర్నకల్ నియోజకవర్గం కురవి మండలం పరిధిలోని కోత్తురు జీ గ్రామంలో సర్పంచ్ మలోతు నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, మహిళల ఆటపాటలు, సంప్రదాయ నృత్యాలతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది. గ్రామంలోని మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి అందంగా అలంకరించిన బతుకమ్మలతో వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ పల్లె సంస్కృతిని ప్రతిబింబించేలా పాటలు పాడుతూ, బతుకమ్మ చుట్టూ ఆడిపాడుతూ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పూల సోయగాలు, మహిళల సందడి గ్రామానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ నిర్వహించిన ఈ వేడుకలు గ్రామ ప్రజల్లో ఐక్యతను, సాంస్కృతిక చైతన్యాన్ని చాటిచెప్పాయి. ఈ సందర్భంగా సర్పంచ్ మలోతు నరేష్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక అని, మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన గొప్ప పండుగ అని పేర్కొన్నారు. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంతో ముడిపడి ఉందన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ అద్భుతమైన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఇలాంటి పండుగలు మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లో సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు. భావితరాలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని పరిచయం చేయడానికి బతుకమ్మ వేడుకలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను కలిసిమెలిసి జరుపుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టేలా నిర్వహించిన ఈ వేడుకలు కోత్తూరు జీ గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కట్లా అశ్విని కృష్ణ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువతీ యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# హైమాస్ లైట్లు వేస్తుండగా విద్యుత్ గా అతనితో యువకుడు మృతి



**దేవరుప్పుల విశాలభారతి :** మండలం ధర్మపురం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది గ్రామంలో హైమాస్ లైట్లు ఏర్పాటు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై చిత్తలూరి మధు 30 మృతి చెందాడు, గ్రామ సర్పంచ్ పిలుపుమేరకు ఆదివారం ఉదయం ఏడు గంటల సమయంలో మధు హైమాస్ లైట్లు ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ ఘాతానికి గురై కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి వెంటనే అంబులెన్స్ లో జనగామ ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తల్లి చిత్తలూరి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవరొప్పుల ఎస్ఐ చింత రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తన కుమారుడి మృతి పై ఎలాంటి అనుమానాలు లేవని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

# అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



**విశాలభారతి, గూడూరు:** మహబూబాద్ జిల్లా గూడూరు లోని పొనుగోడు గ్రామంలో సద్దుల బతుకమ్మ తెలుగు సాంప్రదాయానికి సాంస్కృతికి తగ్గట్టుగా మహిళలు యువతలు చిన్నపిల్లలు వయసుతో సంబంధం లేకుండా బతుకమ్మ బతుకమ్మ పాటలతో ఎంతో అంగరంగ వైభవంగా తెలుగు సాంప్రదాయానికి ముత్యాలతో కోలాటాలతో ఎంతో ఘనంగా నిర్వహించారు బతుకమ్మను తొమ్మిది రోజులు 9 రకాల బతుకమ్మగా చివరి రోజు సద్దుల బతుకమ్మగా ఎంతో తీపి వ్రాయంగా నిర్వహిస్తారు పువ్వులను పూజించే ఈ యొక్క పండుగ గంగమ్మ గౌరమ్మ లు అక్క చెల్లెల్లు తన అక్క అయినటువంటి గంగమ్మ గౌరమ్మను తన చెంతకు చేర్చుకొని అక్కా చెల్లెలు ఎంతో మురిసిపోతుంటారు ఈ యొక్క పండుగ అక్క చెల్లెలు అన్నదమ్ముల అమ్మానాన్నల యొక్క కలయికే ఈ సద్దుల బతుకమ్మ యొక్క ముఖ్య ప్రాధాన్యం మెట్టింటి నుండి తన ఆడబిడ్డను గౌరవప్రదంగా తన ఇంటికి పిలుచుకొని కొత్త బట్టలు పెట్టి పసుపు కుంకుమలు అందించి తమ కుటుంబంను ఆశీర్వదించి పాడిపంటలు సిరి సంపదలు తమ అమ్మ గారి ఇంట్లో సుఖ సంతోషాలు ఉండాలని ఆశీర్వదించి గంగమ్మ ఒడికి గౌరమ్మను పాటలతో సాగనంపడం జరుగుతుంది

# ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డిని కలిసిన 7వ బెటాలియన్ కమాండెంట్ బి. సీతారాం

- నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మర్యాదపూర్వక భేటీ
- బెటాలియన్ అభివృద్ధి, పరిపాలన, వసతుల కల్పనపై చర్చ
- పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



**నిజామాబాద్, విశాలభారతి:** నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని డిచ్‌పల్లి కేంద్రంగా గల 7వ బెటాలియన్ కమాండెంట్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బి. సీతారాం ఆదివారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో భాగంగా కమాండెంట్ సీతారాం పూల మొక్కను అందజేసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా బెటాలియన్‌లో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులు, పరిపాలనాపరమైన అంశాలు, పెండింగ్ బిల్లులు, సిబ్బందికి అవసరమైన మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై ఎమ్మెల్యేతో చర్చించారు. బెటాలియన్ అభివృద్ధికి అవసరమైన అంశాలపై చర్చించి, కమాండెంట్‌గా అంకితభావంతో విధులు నిర్వహించాలని బి. సీతారాంకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఈ నెల 21న 7వ బెటాలియన్‌లో నిర్వహించనున్న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని ఎమ్మెల్యేను కమాండెంట్ సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ డి. శ్రీనివాస్, ఆర్ఐలు త్రిముఖ్, నవనీత్, ఏఆర్ ఎస్ఐ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత తెలంగాణే మన లక్ష్యం: ఎంపీ డా. లక్ష్మణ్



**సికింద్రాబాద్, విశాలభారతి :** మాదకద్రవ్యాల బారినపడి యువత తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని, పిల్లల భద్రతతో పాటు వారి భవిష్యత్తును కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని రాజ్యసభ సభ్యులు డా. లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రజల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక చైతన్యం కల్పించడం, పిల్లలు, యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచడం లక్ష్యంగా అక్షర స్ఫూర్తి చైర్మన్ డాక్టర్ కె లక్ష్మణ్ ఆధ్వర్యంలో చిలకలగూడ క్రాస్‌రోడ్స్ నుంచి వారాసిగూడ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ నిర్మూలన, పిల్లల భద్రత, కుటుంబాల బాధ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం యువత భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయని పేర్కొన్నారు. యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా మార్చే ప్రయత్నాలను అడ్డుకోవడానికి ప్రభుత్వంతో పాటు కుటుంబాలు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులు, వారి స్నేహాలు, అలవాట్లు, రోజువారీ కార్యకలాపాల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సూచించారు. పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడటం, వారికి సరైన మార్గదర్శకత్వం అందించడం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం ద్వారా వారిని ప్రమాదాల నుంచి కాపాడవచ్చని పేర్కొన్నారు. పిల్లల భద్రతకు సంబంధించిన సమస్యలను గుర్తించి, అవసరమైనప్పుడు సంబంధిత అధికారుల సహాయం తీసుకోవడం ప్రతి కుటుంబం బాధ్యతగా భావించాలని అన్నారు. ఈ దిశగా ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఆదివారం సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. పిల్లల భద్రత, యువత ఉజ్వల భవిష్యత్తు, దేశ సమగ్రతను కాపాడటంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని కోరారు. "పిల్లల భద్రత మనందరి బాధ్యత - డ్రగ్స్ రహిత తెలంగాణ మనందరి ధ్యేయం" అనే నినాదంతో నిర్వహించిన ఈ సైకిల్ ర్యాలీ ద్వారా ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడం, యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచడం ప్రధాన లక్ష్యంగా నిలిచింది. ఈ సందర్భంగా ఈగల్ టీం కు సంబంధించిన అధికారి శ్రీనివాసరావు అందరి చేత డ్రగ్స్ కు వ్యతిరేక ప్రమాణ స్వీకారం నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు గుండగోని భరత్ గౌడ్ , బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి, వెంకట రమణి, ప్రభు గుప్తా, కనకట్ల హరి, నాగేశ్వర్ రెడ్డి, మధ్యర్ల శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

# గుండ్రాతిమడుగులో బతుకమ్మ సంబరాల జాతర



- ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు..
- ఆడపడుచులకు గార్లపాటి భరద్వాజ్ రెడ్డి శుభాకాంక్షలు.

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలు కురవి మండలం గుండ్రాతిమడుగు గ్రామంలో అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామ యువకులు, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు పల్లె ప్రజల్లో పండుగ ఉత్సాహాన్ని నింపాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, ఆడపడుచుల ఆటపాటలు, సంప్రదాయ పాటలతో గ్రామమంతా పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా యువ నాయకులు గార్లపాటి భరద్వాజ్ రెడ్డి గ్రామ, మండల ప్రజలకు, తెలంగాణ ఆడపడుచులందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికను రంగురంగుల విద్యుత్ దీపాలు, భారీ ఫ్లెక్సీలతో అలంకరించారు. గ్రామంలోని మహిళలు, యువతులు వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ప్రకృతిలో లభించే పూలను పూజిస్తూ, ప్రకృతితో మమేకమై జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.

**ఆడపడుచులకు భరద్వాజ్ రెడ్డి శుభాకాంక్షలు.**

సద్దుల బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఆత్మగౌరవానికి, ఐక్యతకు ప్రతీక అని యువ నాయకులు గార్లపాటి భరద్వాజ్ రెడ్డి పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూ, భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. గుండ్రాతిమడుగు గ్రామంతో పాటు కురవి మండల ప్రజలకు, తెలంగాణ రాష్ట్ర ఆడపడుచులందరికీ హృదయపూర్వక పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ యువకులు సమష్టిగా ముందుకొచ్చి సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించడం పట్ల గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో యువత చురుకైన పాత్ర పోషించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు గ్రామంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు పాతతరం, కొత్తతరం మధ్య సాంస్కృతిక బంధాలను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ప్రజా సంఘం కురవి మండల అధ్యక్షుడు, జీవీఆర్ యువసేన సోషల్ మీడియా కన్వీనర్ మాచర్ల హరీష్, పేరం భద్రయ్య, జక్క విజయ్, తురక వెంకటేశ్వర్లు, మంగి నరేష్, గాండ్ల వినయ్, అక్షయ్, జంగిలి సాయి, తురక సురేష్, చిలుముల నాగేష్, పంజాల శ్రీధర్, పంజాల వెంకటేష్, కొత్త వంశీ, కారం వినోద్, జంగిలి లోకేష్, జక్క అఖిల్, వీరబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గులాబీ గూటికి పెంజర్ల వాసులు!

- ఉపసర్పంచ్‌తో పాటు 8 మంది వార్డు సభ్యులు,
- సుమారు 100 మంది యువకుల చేరిక
- ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



**కండువా కప్పి బి ఆర్ ఎస్ పార్టీ లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి**

**విశాల భారతి, షాద్ నగర్:** కొత్తూరు మండలం పెంజర్ల గ్రామంలో రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఉపసర్పంచ్ మామిడి శంతన్ రెడ్డితో పాటు మరో ఎనిమిది మంది వార్డు సభ్యులు, సుమారు 100 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆదివారం మొదల్లగూడలోని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి స్వగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెంజర్ల గ్రామం నుంచి నాయకులు, యువకులు భారీ కాన్వాయ్‌తో చేరికల కార్యక్రమానికి తరలివచ్చారు. పెద్ద సంఖ్యలో యువకులు, స్థానిక ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌లో చేరడంతో పార్టీ శ్రేణుల్లో సందడి నెలకొంది. గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు ఒకేసారి పార్టీ మారడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బ్యాగరి రాజు, విలేజ్ వైస్ ప్రెసిడెంట్ కొరట్ల రాములు, పోచయ్య, యువ నాయకుడు శివ చారి, అనిల్ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా పార్టీలో చేరిన నాయకులు, యువకులకు వారు స్వాగతం పలికారు.

# కొత్తూరు జీలో వైభవంగా దుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలు!

- వేద మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి విశేష పూజలు
- పురోహితులు సదాశివ చారి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక శోభ



**కురవి, విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు జీలో దుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గాదేవిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. పురోహితులు సదాశివ చారి అయ్యగారి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా జరిగిన పూజలు, ఆధ్యాత్మిక వాతావరణం ఉత్సవాలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. అమ్మవారి అనుగ్రహం గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు. ఈ పూజా కార్యక్రమాల్లో పురోహితులు సదాశివ చారి అయ్యగారి సతీమణి ఉషశివన్ దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు సాయి మణికంఠ, అరవింద్, పవన్ తదితరులు పాల్గొన్నారు. భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయాల సమ్మేళనంగా నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

# అనారోగ్యంతో ఉన్న బాలుడికి అంగోత్ బిందు పరామర్శ

- బయ్యారం బీఆర్ఎస్ నాయకుడు రేపాకుల వెంకన్న
- కుమారుడికి ఆప్యాయ పలకరింపు



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** ఆపదలో ఉన్న పార్టీ శ్రేణులకు అండగా నిలుస్తూ, ఆప్యాయతను పంచడంలో ముందుండే మహబూబాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ కుమారి అంగోత్ బిందు అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడిని పరామర్శించారు. బయ్యారం మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రేపాకుల వెంకన్న కుమారుడికి ఇటీవల అపెండిక్స్ శస్త్రచికిత్స జరగడంతో విషయం తెలుసుకున్న ఆమె ఆదివారం మహబూబాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా బాలుడిని ఆప్యాయంగా పలకరించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం బాలుడి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాలుడు త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. తమ కుటుంబానికి అండగా నిలిచి పరామర్శించిన అంగోత్ బిందుకు రేపాకుల వెంకన్న కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు బోడ లక్ష్మణ్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు బండమీద సంపత్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు

# పూల పండుగకు మానుకోట మురిసింది!

- ఎన్టీఆర్ స్టేడియంలో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు.
- వేడుకల్లో పాల్గొన్న ఎంపీ పోరిక బలరాం నాయక్,
- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు,
- ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్.



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెబుతూ.. పూల సౌందర్యాన్ని, ఆడపడుచుల ఆత్మీయతను ప్రతిబింబిస్తూ మహబూబాబాద్ పట్టణంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం వేదికగా నిర్వహించిన ఈ వేడుకలు పండుగ శోభను సంతరించుకున్నాయి. తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి గుగులోతు పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకల్లో భాగస్వాములయ్యారు. పూలను దేవతగా కొలుస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ ఆడపడుచులు జరుపుకునే బతుకమ్మ పండుగ రాష్ట్ర సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం మహిళల ఐక్యతకు, కుటుంబాల ఆత్మీయతకు, తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. సద్దుల బతుకమ్మ వేడుకలతో ఎన్టీఆర్ స్టేడియం పండుగ కళను సంతరించుకోగా, ప్రజల భాగస్వామ్యంతో సంబరాలు మరింత ప్రత్యేకతను సంతరించుకున్నాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తోంది. ప్రాంతాలకు, వర్గాలకు అతీతంగా ప్రజలను ఒక్కచోట చేర్చి సాంస్కృతిక ఐక్యతను చాటిచెప్పే ఈ పూల పండుగ మహబూబాబాద్ పట్టణంలో ఆనందోత్సాహాల మధ్య సాగింది.

# దసరా వేళ పాలపిట్టను బంధిస్తే చర్యలు తప్పవు!

- పాలపిట్టను పట్టుకోవడం, వేటాడటం చట్టవిరుద్ధం
- పోలీసులు, అటవీశాఖ సంయుక్త హెచ్చరిక

**విశాలభారతి, షాద్‌నగర్:** దసరా పండుగ సందర్భంగా సంప్రదాయం పేరుతో పాలపిట్టను పట్టుకోవడం, బోనులో బంధించడం, హింసించడం లేదా వేటాడడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు, అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. పాలపిట్ట వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 కింద రక్షణ పొందుతున్న పక్షి అని, దానిని పట్టుకోవడం లేదా బంధించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. పక్షులను స్వేచ్ఛగా జీవించనివ్వాలని, వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గాయపడిన లేదా బంధించిన పాలపిట్ట కనిపిస్తే వెంటనే సంబంధిత అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.రంగారెడ్డి జిల్లా అటవీ అధికారి శ్రీ శివ ఆశీష్ సింగ్, ఐఎఫ్ఎస్ ఆదేశాల మేరకు ఆమనగల్ అటవీ క్షేత్రాధికారి, షాద్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంయుక్తంగా ఈ విజ్ఞప్తి చేశారు.ఆమనగల్ అటవీశాఖ అధికారి 9490424244 షాద్‌నగర్ సీఐ 8712663320 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.



# బృందావన్ కాలనీలో రూ.23.20 లక్షలతో పైప్‌లైన్ పనులకు శ్రీకారం

- **తాగునీటి సరఫరా మెరుగుదలకు ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన**

**రాజేంద్రనగర్, విశాల భారతి :** అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బృందావన్ కాలనీలో తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు రూ.23.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పైప్‌లైన్ నిర్మాణ పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని జలమండలి ఆధ్వర్యంలో 450 ఎంఎం వ్యాసం కలిగిన పైప్‌లైన్ నిర్మాణ పనులను చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే కాలనీలో తాగునీటి సరఫరా వ్యవస్థ మరింత మెరుగుపడటంతో పాటు స్థానికంగా నెలకొన్న నీటి సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాలనీల అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా చేపడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జలమండలి అధికారులు, స్థానిక నాయకులు, బృందావన్ కాలనీ వాసులు పాల్గొన్నారు. కాలనీలో పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



## అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి

- **మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి**
- **అమ్మవారి సన్నిధిలో హోమంలో పాల్గొన్న షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే**



**విశాలభారతి, షాద్ నగర్:** ప్రజలందరూ సుఖ సంతోషాలతో చల్లగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు..ఆదివారం షాద్ నగర్ పట్టణంలోని సోలిపూర్ బైపాస్ వద్ద ఉన్న శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవాలయంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి చేరుకున్న ఆయన అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.అనంతరం ఆలయంలో నిర్వహించిన హోమ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ధర్మకర్త షాద్ నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు,హోమ కార్యక్రమాలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు.మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహించి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలపై బంగారు మైసమ్మ తల్లి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. దేవీ నవరాత్రులు భక్తిభావానికి, ఆధ్యాత్మిక చింతనకు ప్రతీకలని, ఇలాంటి పండుగలు ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకుంటూ చౌలపల్లి ప్రతాప్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి హోమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, సతీష్, ప్రదీప్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్లాపూర్‌మెట్‌లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు

- **మాదకద్రవ్యాల నిర్మూలనకు యువత కృషి చేయాలి**
- **మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి.. అవగాహన కల్పించిన సీఐ సీహెచ్ రాజు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ సీఐ సీహెచ్ రాజు సూచించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల ముస్లిం మైనారిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పోలీసుల సమన్వయంతో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి హాజరుకాగా, సీఐ సీహెచ్ రాజు యువతకు, స్థానిక ప్రజలకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా వివిధ రకాల మాదకద్రవ్యాల వినియోగం వల్ల శారీరకంగా, మానసికంగా ఎదురయ్యే తీవ్ర పరిణామాలను వివరించారు. డ్రగ్స్‌కు బానిసైన వారిలో కనిపించే ప్రవర్తనా మార్పులు, వ్యసన లక్షణాలు, ముందస్తు హెచ్చరిక సంకేతాలను గుర్తించడం ద్వారా అప్రమత్తంగా ఉండవచ్చని తెలిపారు. మాదకద్రవ్యాల బారినపడిన వారికి సకాలంలో కౌన్సెలింగ్, సరైన వైద్య చికిత్స, పునరావాస కేంద్రాల ద్వారా అవసరమైన సహాయం అందించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని, వాటికి దూరంగా ఉంటూ సురక్షితంగా జీవించాలని కార్యక్రమంలో పిలుపునిచ్చారు. యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా, తమ స్నేహితులు, పరిసర ప్రాంతాల ప్రజల్లోనూ అవగాహన కల్పించాలని సూచించారు. మాదకద్రవ్యాల విక్రయాలు, సరఫరా, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించడం ద్వారా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి సహకరించాలని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం పోలీసుల ఒక్కరి బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మత్తు పదార్థాల నివారణకు ప్రజాప్రతినిధులు, యువత, వివిధ సంఘాల నాయకులు పోలీసులతో సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బుర్ర రేఖ మహేందర్‌గౌడ్, అబ్దుల్లాపూర్‌మెట్ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్, అబ్దుల్లాపూర్‌మెట్ అడ్మిన్ ఎస్ఐ సైదులు, ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దసరా సందడి నిల్



**విశాల భారతి, సిటీబ్యూరో:** దసరా రోజున ఏ కార్యం చేపట్టిన దిగ్విజయంగా పూర్తవుతుందనే సెంటిమెంట్‌కు కాంగ్రెస్ సర్కార్ బ్రేక్ చేసింది. పండుగ రోజున సొంతింట్లో అడుగు పెట్టేవారు, డ్రీమ్ హోంకు భూమి పూజ చేసుకునేవారు, చివరకు కొత్తగా స్లాబ్ పనులు చేసే వారు కూడా దసరా పండుగ రోజున చేయడానికి ప్రాధాన్యతనిస్తారు. కానీ గడిచిన మూడేండ్ల నుంచి నగరంలో ఆ సందడి లేకుండా పోయింది. దీంతో ఏటా దసరా సందడి రియల్ ఎస్టేట్ రంగంలో కనిపించకుండా పోయింది. ఆరు నెలల ముందు నుంచే రియల్ ఎస్టేట్ లావాదేవీలన్నీ పడిపోగా, కొత్త రెసిడెన్షియల్ ప్రాజెక్టులకు భూమి పూజ లేకుండా చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపలేదు. నగరంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే రియల్ ఎస్టేట్ రంగాన్ని సంక్షోభాన్ని నెట్టివేసింది. చెరువులు, కుంటల సంరక్షణ పేరిట ఆక్రమణలను తొలగిస్తున్నామని చెప్పి..పేదల ఇండ్లను కూల్చివేయడంతో నగరంలో రియల్ రంగాన్ని ఆందోళన మొదలైంది. ఆ తర్వాత పాలన సంస్కరణల పేరిట తీసుకువచ్చిన భూ భారతి, బిల్డ్ నౌ గందరగోళాన్ని సృష్టించాయి. ఇక కోలుకునే లోపే రియాల్టీపై 22ఏ పిడుగేసిన కాంగ్రెస్ సర్కార్.. దశల వారీగా ఈ రంగాన్ని నిర్వీర్యం చేసే . విధానాలను పకడ్బందీగా అమలు చేస్తోంది. ఇక రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల నిర్మాణ అనుమతుల్లో సాగుతున్న అక్రమ కార్యకలాపాలతో వ్యాపారులే భయపడిపోతున్నారు. దీంతో కట్టిన ఇండ్లను అమ్ముకోలేక, కొత్త ప్రాజెక్టులకు అనుమతులు తీసుకోలేక రియల్ వ్యాపారుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా మారింది.

**కనిపించని దసరా సందడి**

దసరా వచ్చిందంటే నగరం చుట్టూరా వందలాది వెంచర్లు శంకుస్థాపనలు, భూమి పూజలతో కళకళలాడేవి. కానీ హైడ్రా కూల్చివేతలతో మొదలైన సర్కారు విధానాలతో జనాలు, బిల్డర్లు, డెవలపర్లు కూడా కొత్త ప్రాజెక్టుల జోలికి వెళ్లేందుకు జంకుతున్నారు. ఒకప్పుడు దసరా వచ్చిందంటే నగరంలో నిర్మాణం పూర్తైన ప్రాజెక్టులను కొనుగోలుదారుల చేతికిచ్చేవి 15వేలకు పైగా ఉండేవి. ఇక కొత్త రిజిస్ట్రేషన్లు కూడా 10వేలకు పైగా జరిగేవి. కానీ ఈ గణాంకాలు అన్ని కనుమరుగైపోయాయి. ఇక వందలాది వెంచర్లకు భూమి పూజలతో సందడిగా ఉండే శివారు ప్రాంతాల్లో మార్కెట్ లేక వ్యాపారులు దిగాలుగా ఉన్నారు. కనీసం పండుగ పూట రియల్ ఎస్టేట్ ప్రాజెక్టును తీసుకు రాలేకపోయామని ఎంతో మంది వ్యాపారులు ఉన్నారు.

## కురవిలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- **పూల పండుగలో వెల్లివిరిసిన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు**



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో పట్టణ వీధులన్నీ పండుగ శోభను సంతరించుకున్నాయి. మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు.

**వర్ణరంజితంగా బతుకమ్మల ప్రదర్శన.**

సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి వేడుకలకు తరలివచ్చారు. సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిన మహిళలు, యువతులు, చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. పూలతో పేర్చిన బతుకమ్మల అందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎటుచూసినా పండుగ సందడి కనిపించడంతో కురవి మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది.

**డీజే పాటలు.. కోలాటాలతో సందడి.**

అనంతరం డీజే పాటలు, మహిళల కోలాటాల నడుమ బతుకమ్మలతో భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలు బతుకమ్మలను నెత్తిన ఎత్తుకుని సంప్రదాయబద్ధంగా చెరువు వైపు కదిలారు. ఈ సందర్భంగా ర్యాలీ పొడవునా పాటలు, నృత్యాలతో సందడి నెలకొంది. ఊరంతా ఒక్కటై పూల పండుగలో భాగస్వాములు కావడం వేడుకలకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.

**బతుకమ్మ పాటలతో మార్మోగిన చెరువు పరిసరాలు**

చెరువు ఒడ్డున మహిళలంతా ఒకచోట చేరి 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ సంప్రదాయ పాటలు ఆలపించారు. వలయాకారంలో తిరుగుతూ చప్పట్లతో బతుకమ్మ ఆడారు. అనంతరం గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేశారు. ఒకరికొకరు వాయనాలు ఇచ్చిపుచ్చుకుంటూ, సద్దులను పంచుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**సంప్రదాయాలకు ప్రతీకగా పూల పండుగ.**

సద్దుల బతుకమ్మ వేడుకలు మహిళల ఐక్యతకు, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలిచాయి. తరతరాలుగా వస్తున్న పండుగ ఆచారాలను కొనసాగిస్తూ మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమంలో కురవి గ్రామ పంచాయతీ సర్పంచ్ లక్ష్మి రాజునాయక్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువతులు, చిన్నారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- **దసరా వేళ నిరుపేద కుటుంబాలకు రేషన్ కార్డుల పంపిణీ.. ప్రజల్లో హర్షా తిరేకాలు**
- **సంక్షేమ పథకాల అమలులో కార్యకర్తలకు ప్రాధాన్యం.. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** తెలంగాణలో నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పేదలకు నిత్యావసర సరుకులు అందించడంతోపాటు, సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్త రేషన్ కార్డుల మంజూరుకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పలు పథకాలను అమలు చేస్తుంటే, గతంలో అధికారంలో ఉన్నవారు విమర్శలు చేయడం సరికాదని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతోపాటు అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచనల మేరకు గత రెండు రోజులుగా తట్టి అన్నారం, ఆర్‌కే నగర్ ప్రాంతాలతోపాటు పెద్ద అంబర్‌పేట పరిధిలో కాంగ్రెస్ నాయకులు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. పెద్ద అంబర్‌పేట మాజీ కౌన్సిలర్ మల్లెపాక మల్లేష్, ఢిల్లీ మాధవరెడ్డి, దేవిడి వేణుగోపాల్‌రెడ్డి, చంద్రగోని గోవర్ధన్‌గౌడ్ తదితర కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు.

**కార్యకర్తలకే సంక్షేమ పథకాల అమలులో ప్రాధాన్యత**

పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలే తనకు మొదటి ప్రాధాన్యత అని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పలుమార్లు స్పష్టం చేశారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గ్రామాలు, కాలనీల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరవేయడంలో పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పడమే కాకుండా, ఆచరణలోనూ చూపిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకు సక్రమంగా అందేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.

**దసరా వేళ పేద కుటుంబాల్లో ఆనందం**

దసరా పండుగకు ముందు రేషన్ కార్డులు మంజూరు కావడం, వాటిని లబ్ధిదారులకు అందజేయడంతో పేద కుటుంబాల్లో ఆనందం నెలకొందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందుతాయనే ఆశాభావం వ్యక్తమవుతోందన్నారు. పండుగకు ముందు కార్డులు అందడంతో ప్రజల్లో మరింత పండుగ వాతావరణం నెలకొందని, తమకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

## జనపనార సంచులతో స్వయం ఉపాధికి బాటలు

- **గ్రామీణ మహిళలకు ఆర్థిక స్వావలంబన లక్ష్యం**
- **25 మంది మహిళలకు ఉచిత శిక్షణ**
- **20 రకాల సంచుల తయారీలో నైపుణ్యాలు**



**విశాల భారతి, షాద్ నగర్:** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం హాజీపల్లి గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణహిత జనపనార ఉత్పత్తులను ప్రోత్సహించే లక్ష్యంతో మహిళలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. మహిళా సేవా మండలి అధ్యక్షురాలు ఆలియా సుల్తానా సహకారంతో,చిలుకూరు మహిళా ప్రాంగణం సౌజన్యంతో గత 15 రోజులుగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇందులో భాగంగా 25 మంది మహిళలకు జనపనార, వస్త్రంతో తయారు చేసే 20 రకాల సంచుల తయారీలో శిక్షణ ఇచ్చారు.ముగింపు కార్యక్రమంలో హాజీపల్లి సర్పంచ్ కుమార్,కాంగ్రెస్ కార్యకర్త దర్శన్, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, పొదుపు సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శిక్షణ పొందిన మహిళలు తాము నేర్చుకున్న వివిధ రకాల సంచుల తయారీ నైపుణ్యాలను ప్రదర్శించారు. గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తమవంతు సహకారం అందిస్తామని స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తెలిపారు. శిక్షణలో పాల్గొన్న మహిళలకు 15 రోజుల పాటు భోజన, వసతి సౌకర్యాలు కల్పించి, ఉచితంగా శిక్షణ అందించిన మహిళా ప్రాంగణం నిర్వాహకులకు గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలియా సుల్తానా మాట్లాడుతూ జనపనారతో తయారు చేసిన సంచులకు రాబోయే రోజుల్లో మంచి ఆదరణ లభించే అవకాశాలున్నాయని, వాటి తయారీతో మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని వివరించారు. జనపనార ఉత్పత్తుల మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తూ, మహిళలు తాము నేర్చుకున్న నైపుణ్యాలను ఆదాయ మార్గాలుగా మలుచుకోవాలని సూచించారు.

## దసరా పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలి

- **యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దగోని మౌనిక రమేష్ గౌడ్ దసరా శుభాకాంక్షలు**



**చౌటుప్పల్ విశాలభారతి:** ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దగోని మౌనిక రమేష్‌గౌడ్ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు, సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దసరా పండుగను ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని, ప్రజలందరికీ మంచి జరగాలని, సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత పెంపొందాలని పెద్దగోని మౌనిక రమేష్ గౌడ్ ఆకాంక్షించారు.

## కట్టమైసమ్మ ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

- **ఆలయానికి ఎకరం భూమి కేటాయింపునకు కృషి చేస్తానని హామీ**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరి సంపదలతో ఉండాలని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆకాంక్షించారు. బుద్వేల్ టీచర్స్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ ఆలయంలో ప్రధాన అర్చకులు తాళ్లపాక సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కార్తీక్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు.

**ఆలయ అభివృద్ధికి సహకరిస్తా**

ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి ఆలయ అభివృద్ధి, భవిష్యత్తులో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు సంబంధించిన అంశాలపై ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకలుగా నిలిచే ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**పురాతన రహదారి పనులతో ఆలయ స్థలంపై ఆందోళన**

బుద్వేల్ నుంచి రాజేంద్రనగర్ వరకు ఉన్న పురాతన రహదారి పునరుద్ధరణకు అధికారులు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో కట్టమైసమ్మ ఆలయ స్థలానికి సంబంధించి ఆందోళన నెలకొంది. రహదారి పనులు ఆలయ ప్రాంగణం మీదుగా చేపడితే దేవాలయానికి సంబంధించిన స్థలం కోల్పోయే అవకాశం ఉందని ఆలయ కమిటీ సభ్యులు కార్తీక్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఆలయానికి ఎలాంటి నష్టం కలగకుండా రహదారి పనులు చేపట్టేలా సంబంధిత అధికారులతో మాట్లాడాలని కోరారు. అదేవిధంగా విశ్వవిద్యాలయ అధికారులతో చర్చించి ఆలయానికి ఒక ఎకరం భూమి కేటాయించేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ఎకరం భూమి కేటాయింపునకు కృషి చేస్తా**

ఆలయ కమిటీ సభ్యుల విజ్ఞప్తిపై స్పందించిన పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, సంబంధిత విశ్వవిద్యాలయ అధికారులతో చర్చించి ఆలయానికి ఒక ఎకరం భూమి కేటాయించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయ స్థలానికి ఇబ్బంది కలగకుండా సంబంధిత అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న తోకల శ్రీనివాస్ రెడ్డి

- **అమ్మవారికి ప్రత్యేక పూజలు.. అన్నదాన కార్యక్రమంలో భాగస్వామ్యం**



**రాజేంద్రనగర్, విశాల భారతి :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు, సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో బతుకమ్మ సంబరాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బృందావన్ కాలనీ, కాటేదాన్ టీఎన్‌జీఓఎస్ ఆర్‌జీకే ప్రాంతంతో పాటు డివిజన్‌లోని పలు కాలనీలలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలను తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా ఆయా మండపాల్లో నిర్వహించిన అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొని, అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించి భక్తులతో కలిసి పండుగ వేడుకల్లో భాగస్వాములయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు అనంతరం తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, సద్దుల బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గొప్ప పండుగ అని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను, కుటుంబాల్లో ఆనందాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. అమ్మవారి చల్లని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పాండు యాదవ్, మాజీ డివిజన్ అధ్యక్షుడు అడికె జనార్ధన్, రావుల భాస్కర్, శ్రీకాంత్ రెడ్డి, నర్సిరెడ్డి, రమేష్ రెడ్డి, శంకర్ రెడ్డి, అడికె శివ, అంజమ్మ, రాజేష్, రవి, నిఖిల్, కార్తీక్ తదితర స్థానిక నాయకులు, బీజేపీ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

- **సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ**



**మునగాల, విశాల భారతి:** మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామంలో. శ్రీ కోదండరామ స్వామి కళ్యాణ మంటపం వద్ద ఏర్పాటు చేసిన. సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా. ఏర్పాట్లను గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ. ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి ప్రత్యేకంగా నిలిచే పండుగ బతుకమ్మ అని ప్రకృతిని పూజిస్తూ పూలను దేవతగా కొలుస్తూ తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగ మన సంస్కృతి ఐక్యత సంతోషాలకు ప్రతీకనే ప్రకృతిని ఆరాధించే పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయులకు ఆనందానికి ప్రత్యేక బతుకమ్మ .పూలతో బతుకమ్మ పేర్చి సాంప్రదాయాన్ని. కొనసాగిస్తూ. సాంప్రదాయ నృత్యాలతో సాంప్రదాయ పాటలు పాడుతూ అత్యంత భక్తి శ్రద్ధలతో. మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలు ఆడటం. సంతోషదాయకమని అలాగే తమ గ్రామంలో సుమారుగా 70 నుంచి 80 సంవత్సరాల క్రితం బతుకమ్మలు ఆడటం ఆనవాయితీ అని అలాగే తమ కుటుంబం సుమారుగా 45 సంవత్సరాలుగా ఈ బతుకమ్మలను క్రమం తప్పకుండా ఆడటం. తమ ఇంటి ఆడపడుచులు ప్రత్యేకంగా ఈ బతుకమ్మ పండుగ లో. పాల్గొనడం విశేషమని. అలాగే ఈ సంవత్సరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం. ప్రత్యేకంగా తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన నేపథ్యంలో. గ్రామంలో బతుకమ్మ లాడే మహిళలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రత్యేకమైన లైటింగ్ ఏర్పాటు చేసి. పారిశుద్ధ కార్యక్రమాలు నిర్వహించి. వాటర్ సౌకర్యం కల్పించి. బతుకమ్మలు ఆడే వద్ద గ్రీన్ మ్యాట్లని ఏర్పాటు చేసి అలాగే నిమజ్జనం చేసే కోనేరు వద్ద కూడా ప్రత్యేక లైటింగ్ తో పాటు పారిశుద్ధ కార్యక్రమాలు నిర్వహించి భారీకేట్లను ఏర్పాటు చేశామని అన్నారు.

# అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు





- పల్లెపల్లెలో పూల పండుగ సందడి
- తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు
- బతుకమ్మ పాటలతో మారుమోగిన భద్రాద్రి జిల్లా (కొడారి వెంకటేశ్వర్లు)



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :**

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యంత వైభవంగా నిర్వహించారు. అశ్వాపురం మండలంలోని పలు గ్రామాలు, పంచాయతీలు, కాలనీల్లో మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో పల్లెలు కళకళలాడగా, మహిళల ఆటపాటలు, బతుకమ్మ పాటలతో పండుగ వాతావరణం నెలకొంది.

**మండలంలోని ప్రతి పంచాయతీలో బతుకమ్మ వేడుకలు :**

అశ్వాపురం మండలంలోని మొండికుంట, మల్లెలమడుగు గ్రామాలతో పాటు అశ్వాపురం మండల కేంద్రంలోని రామాలయం, చవిటిగూడెం, మిట్టగూడెం, కళ్యాణపురం, రామచంద్రపురం, గొందిగూడెం, తుమ్మలచెరువు, అమ్మగారిపల్లి, అమేర్ధ, సంద్రబోడు, చింతిర్యాల కాలనీ, గొల్లగూడెం, సీతారామపురం, ఆనందపురం, నెల్లిపాక తదితర గ్రామాలు, పంచాయతీల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే అశ్వాపురం మండల కేంద్రంలోని భారజల ఉద్యోగుల నివాస ప్రాంతమైన గౌతమి నగర్ కాలనీలో అంగరంగ వైభవంగా సంబరాలు జరిపారుపూకున్నారు.

**పల్లెపల్లెలో అంబరాన్నంటిన పూల పండుగ సందడి**

తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక స్థానం కలిగిన బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామాల్లో మహిళలు ఒకచోట చేరి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడారు. చప్పట్లు కొడుతూ ఆటపాటలతో సందడి చేశారు. పెద్దలు, యువతులు, చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణలో వేడుకలకు హాజరై పండుగ శోభను మరింత పెంచారు. తరతరాలుగా వస్తున్న బతుకమ్మ ఆచారాలను కొనసాగిస్తూ తెలంగాణ జానపద సంస్కృతిని చాటిచెప్పారు. గ్రామాల్లోని మహిళలంతా కలిసికట్టుగా వేడుకల్లో పాల్గొనడంతో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది.

**మొండికుంట, మల్లెలమడుగులో వైభవంగా**

మండలంలోని మొండికుంట, మల్లెలమడుగు గ్రామాల్లో వందలాది బతుకమ్మలతో వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు ఉదయం నుండే బతుకమ్మలను పేర్చి, సామూహికంగా వేడుకలు నిర్వహించారు. సంప్రదాయ గీతాలు ఆలపిస్తూ ఉత్సాహంగా ఆడిపాడారు. గ్రామీణ జీవనంలో బతుకమ్మ పండుగకు ఉన్న ప్రాధాన్యతను ఈ వేడుకలు మరోసారి చాటిచెప్పాయి.

**గౌతమి నగర్ కాలనీలో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు**

అశ్వాపురం మండల కేంద్రంలోని గౌతమి నగర్ కాలనీలో సద్దుల బతుకమ్మ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భారజల ఉద్యోగుల కుటుంబాలకు చెందిన మహిళలతో పాటు ఇతర మహిళలు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళల ఐక్యత, ఆత్మీయత ప్రతిబింబించాయి. పూల అలంకరణలు, సంప్రదాయ గీతాలు, ఉత్సాహభరితమైన ఆటపాటలతో కాలనీ పరిసరాలు సందడిగా మారాయి.

**ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ :**

బతుకమ్మ పండుగ కేవలం సంప్రదాయ వేడుక మాత్రమే కాదు. ప్రకృతిని ఆరాధించడం, పూల ప్రాధాన్యతను గుర్తించడం, మహిళల మధ్య స్నేహ సంబంధాలను బలోపేతం చేయడం ఈ పండుగ ప్రత్యేకత. పూలను పేర్చి బతుకమ్మగా రూపొందించడం నుంచి సామూహికంగా పాటలు పాడుతూ వేడుకలు జరుపుకోవడం వరకు ప్రతి అంశంలోనూ తెలంగాణ సంస్కృతి ప్రతిఫలిస్తుంది. ఆధునిక జీవనశైలిలో అనేక మార్పులు వచ్చినప్పటికీ బతుకమ్మ పండుగపై ప్రజల్లో ఉన్న అభిమానం తగ్గడం లేదు. గ్రామాలు, కాలనీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొంటూ తమ సంప్రదాయాలను భావితరాలకు అందిస్తున్నారు.

## ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరు



- తొందర్లో డీపీఆర్ సిద్ధం
- నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం
- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

**ఇందూరు , విశాల భారతి:** ఎంతో ఘన చరిత్ర కలిగిన ఇందూరు ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరైనట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఛత్రపతి శివాజీ గురువు సమర్ధ రామదాసు నిర్మించిన చారిత్రాత్మక కట్టడం ఖిల్లా రామాలయం అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో దాశరథి కృష్ణమాచార్యులు జైలు శిక్షణ అనుభవిస్తూ "తెలంగాణ నాకోటి రతనాల వీణ " అని రాసిన గొప్ప చరిత్ర కలిగిన ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరు కావడం సంతోషకరమన్నారు. పర్యాటక స్థలంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. సుమారు రూ.35 కోట్ల నిధులతో రోప్ వే నిర్మాణం కానుందని, ఇందుకోసం డీపీఆర్ సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో పాలించిన పాలకులు రామాలయ అభివృద్ధిని మరిచారన్నారు. మోదీ ప్రభుత్వం చారిత్రక కట్టడాలపై ప్రత్యేక దృష్టి వహిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగానే పర్వతమాల పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తో కలిసి ఖిల్లా రామాలయ అభివృద్ధి కొరకు గతంలో కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. దీంతో రోప్ వే మంజూరైనట్లు స్పష్టం చేశారు. కేంద్రమంత్రి నితిన్ ఘట్కరితో పాటు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఖిల్లా రామాలయ అభివృద్ధి పై అనేక సార్లు లేఖలు అందజేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రోడ్లు భవనాల శాఖ అధికారులను, రోప్ వే కంపెనీ ప్రతినిధులను పంపడం సంతోషకరమన్నారు. అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన పనులపై కూడా అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఒక్కటి కూడా రాని నియోజకవర్గం ఇందూరు ఒకటేనని చెప్పారు. సమస్యను మంత్రి పొంగిలేటి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. దీంతో ఇటీవల అర్బన్ లోని సౌత్ మండల అర్హులకు ఇళ్లను కేటాయించాలని గుర్తు చేశారు. అలాగే స్థలం లేని వారికి హైదరాబాద్ మాదిరిగా టవర్లు నిర్మించి ఇవ్వాలని చెప్పినట్లు తెలిపారు. ప్రధానంగా స్పెషల్ ఫండ్ కోసం ప్రభుత్వానికి అనేకసార్లు లీగల్ రాసిన స్పందించడం లేదన్నారు. చివరికి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందన్నారు. స్పెషల్ ఫండ్ కేటాయిస్తే నియోజకవర్గ అభివృద్ధి సులువుగా అవుతుందని తెలిపారు.

## ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన పిఏసిఎస్ అధ్యక్షులు



**రెంజల్, విశాల భారతి :** రెంజల్ మండల పరిధిలో మూడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతనంగా నియమించబడిన రెంజల్ పిఏసిఎస్ అధ్యక్షులు గుజ్జుల సాయిరెడ్డి, నీలా పిఏసిఎస్ అధ్యక్షులు జావిద్, దూపల్లి పిఏసిఎస్ అధ్యక్షులు సిహెచ్. రాములు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డిని మర్యాదపూర్వకముగా కలిసి శాలువలతో ఘనంగా సన్మాన కార్యక్రమం చేపట్టి, బొక్కెతో సత్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆదుకోవాలని దృఢసంకల్పంతో నామినేట్ పద్ధతిలో పిఏసిఎస్ అధ్యక్షులు, డైరెక్టర్ లను నియమించి, పాత్రలు అందజేశారు. రైతుల అనుసంధానంతో కూడిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సమస్యల పట్ల అధ్యక్షులు, డైరెక్టర్ లు ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. నూతనంగా నియమించబడిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు గుజ్జుల సాయి రెడ్డి, జావిద్, సిహెచ్. రాములు, మాట్లాడుతూ మా మీద నమ్మకంతో పిఏసిఎస్ అధ్యక్షులుగా బాధ్యతలు అప్పజెప్పిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు, మాజీ మంత్రి ,బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోబిన్ ఖాన్, దండిగుట్ట గ్రామ సర్పంచ్ ధనుంజయ్, కందకుర్తి గ్రామ సర్పంచ్ గియాజొద్దీన్, జావీద్, సిహెచ్. రాములు, డైరెక్టర్ లు, ఎమ్మెల్ రాజు, తదితరులు ఉన్నారు.

## సిద్ధాపూర్ డంపింగ్ యార్డు రద్దు చేయాల్సిందే!

- 15వ రోజు రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం
- పార్టీలకు అతీతంగా పోరాడుదాం
- డంపింగ్ యార్డును రద్దు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- జీవో రద్దయ్యే వరకు ఉద్యమం ఆగదు: జేఏసీ

**విశాల భారతి, షాద్‌నగర్:**

సిద్ధాపూర్ డంపింగ్ యార్డు ప్రతిపాదనను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సాగుతున్న ప్రజా ఉద్యమానికి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క మద్దతు ప్రకటించారు. జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం 15వ రోజుకు చేరుకోగా, విమలక్క నేతృత్వంలో మహిళలు బహుజన బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఆటపాటలతో 'బతుకమ్మా బతుకనీయమ్మా.. సేవ్ సిద్ధాపూర్' అంటూ నినదించి ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. డంపింగ్ యార్డు రద్దు చేసే వరకు పోరాటానికి అండగా ఉంటానని విమలక్క ప్రకటించారు.ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటుకు ప్రభుత్వం జీఓ నంబర్ 641 తీసుకురావడం దారుణమని విమర్శించారు. ఫ్యూచర్ సిటీకి సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో పర్యావరణంపై ఎలాంటి ప్రభావం పడుతుందో ప్రభుత్వం ఆలోచించాలని ప్రశ్నించారు. ప్రజలు పార్టీలకు అతీతంగా ఏకమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ అంశంపై గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

### బతుకమ్మ ఆటపాటలతో ఉద్యమానికి మద్దతు తెలిపిన విమలక్క




**పార్టీలకు అతీతంగా పోరాడాలి**

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ సిద్ధాపూర్ డంపింగ్ యార్డు రద్దు కోసం జేఏసీ ఆధ్వర్యంలో అన్ని పార్టీలు కలిసి పోరాడాలని కోరారు. బీఆర్ఎస్ తరఫున జేఏసీ చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేస్తామని తెలిపారు. ఉద్యమానికి మద్దతుగా వచ్చిన విమలక్కకు కృతజ్ఞతలు చెప్పారు.

**ప్రజల జీవన విధానాన్ని కాపాడాలి**

బీజేపీ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సిద్ధాపూర్ ప్రజల జీవన విధానానికి, భవిష్యత్తు తరాలకు నష్టం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం పునఃసమీక్షించాలని కోరారు. జీఓ ఆర్టీ నంబర్ 641ను రద్దు చేసి గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ప్రజల పక్షాన పోరాడతాం: శేఖర్ రెడ్డి**

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి మాట్లాడుతూ డంపింగ్ యార్డు రద్దు కోసం ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. ఈ అంశంపై పార్టీ అధిష్ఠానం నుంచి గతంలో నోటీసులు అందుకున్నప్పటికీ ప్రజల ప్రయోజనాల కోసం తన వైఖరిలో మార్పు ఉండదని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కూడా డంపింగ్ యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ సానుకూలంగా స్పందించారని, ప్రజలకు అన్యాయం జరిగితే పార్టీని వీడేందుకు కూడా వెనుకాడనని వ్యాఖ్యానించారు.రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, జేఏసీ నాయకులు తిరుమలయ్య, టీజీ శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రీనివాస రెడ్డి, బాలయ్య, రంజిత, మహేష్, ఈశ్వర్ నాయక్, శ్రీకాంత్, రవీంద్రనాథ్, అర్జునప్ప, గ్రామ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు న్యాయం చేయాలి: గణేష్ బిగాల




- గౌరవప్రదమైన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్
- ఉద్యోగుల హక్కుల పోరాటానికి మద్దతు

**నిజామాబాద్, విశాల భారతి:** ప్రజారోగ్య వ్యవస్థలో కీలక సేవలు అందిస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల డిమాండ్ చేశారు. న్యాయమైన హక్కుల సాధన కోసం ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. వారి డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గణేష్ బిగాల మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల కృషి ఎంతో కీలకమని పేర్కొన్నారు. సేవలకు తగిన గుర్తింపు, ఉద్యోగ భద్రత, వేతనాలు, ఇతర సౌకర్యాల విషయంలో ఉద్యోగులు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజారోగ్య సేవల్లో భాగస్వాములైన సిబ్బంది సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు గౌరవప్రదమైన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. స్టేట్ హెల్త్ సొసైటీ (ఎస్‌హెచ్ఎస్) ద్వారా 'SPARSH' విధానంలో వేతనాలు చెల్లించాలన్న ఉద్యోగుల డిమాండ్‌ను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న 5 శాతం ఇంక్రిమెంట్, 8 శాతం వార్షిక వేతన పెంపును అమలు చేయాలని కోరారు. ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల మాదిరిగా ఎన్‌హెచ్ఎం సిబ్బందికి కూడా సెలవుల సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. గర్భిణీ ఉద్యోగులకు ప్రసూతి సెలవులు, ఇతర అర్హత కలిగిన సిబ్బందికి తగిన సెలవుల సౌకర్యాలు అందించాలన్నారు. ఉద్యోగులకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇన్సూరెన్స్ సౌకర్యాలతో పాటు ఈహెచ్ఎస్/ఈఎస్ఐ ద్వారా వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ, ఏరియర్స్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్లు 60, 1195 ప్రకారం అర్హత కలిగిన ఉద్యోగులకు వేతన సవరణ ప్రయోజనాలు కల్పించాలన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి న్యాయం చేయాలని గణేష్ బిగాల కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్, నగర అధ్యక్షుడు సిర్ప రాజు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం దసరా ఉత్సవాల ఆహ్వానాలపై వివాదం

- ఎంపీ, కార్మిక సంఘాల నాయకులను విస్మరించారంటూ అసంతృప్తి
- నిర్వాహకుల తీరును ప్రశ్నించిన కాంగ్రెస్ సీనియర్ నేతలు



**రామగుండం , విశాల భారతి :** రామగుండం కార్మిక క్షేత్రంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాల ఆహ్వానాలపై వివాదం నెలకొంది. పెద్దపల్లి ఎంపీతో పాటు స్థానిక కార్మిక సంఘాల సీనియర్ నాయకులకు ఆహ్వానం కల్పించలేదని పలువురు కాంగ్రెస్ నేతలు, కార్మిక సంఘాల ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆహ్వాన పత్రికలో ప్రజాప్రతినిధుల పేర్లు, ఫొటోలకు ప్రాధాన్యత కల్పించిన తీరుపై నిర్వాహకులతో పలువురు నాయకులకు విభేదాలు తలెత్తినట్లు సమాచారం. తొలుత మేయర్ పేరు మాత్రమే ముద్రించి, ఫొటోను పొందుపరచకపోవడం, డిప్యూటీ మేయర్ పేరు లేకపోవడంపై అభ్యంతరాలు వ్యక్తమైనట్లు తెలిసింది. అనంతరం రూపొందించిన మరో ఆహ్వాన పత్రికలో మేయర్ పేరు, ఫొటో చేర్చినట్లు సమాచారం. రామగుండం పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్నప్పటికీ ఎంపీ పేరును ఆహ్వాన పత్రికలో పేర్కొనకపోవడం ఏమిటని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుమ్మడి కుమారస్వామి ప్రశ్నించారు. ఎంపీ ఎస్సీ సామాజిక వర్గానికి చెందినందుకే విస్మరించారా అంటూ ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణపై నిర్వాహకుల వివరణ తెలియాల్సి ఉంది. ఉత్సవాల్లో భాగస్వాములైన సింగరేణి, ఎన్టీపీసీ సంస్థలకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని పలువురు నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాడుతున్న జాతీయ కార్మిక సంఘాల నాయకులను ఆహ్వానించకపోవడాన్ని తప్పుబట్టారు. స్థానిక కార్యక్రమాల నిర్వహణలో కొందరి నిర్ణయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని అసంతృప్త నేతలు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులను సమన్వయం చేసుకుని ఉత్సవాలు నిర్వహించాలని కోరుతున్నారు. ఈ వ్యవహారంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించే యోచనలో ఉన్నట్లు కొందరు సీనియర్ కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు.

## కాళేశ్వరం నిర్మాణంతోనే సిద్దిపేటకు గోదావరి జలాలు: హరీశ్ రావు

- కోమటి చెరువు వద్ద కుటుంబ సమేతంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి
- పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని పిలుపు




**సిద్దిపేట , విశాల భారతి:** రాష్ట్రంలో నీటి కొరత ఉన్నప్పటికీ సిద్దిపేట కోమటి చెరువు గోదావరి జలాలతో నిండి మత్తడి దూకుతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఆదివారం బతుకమ్మ వేడుకల సందర్భంగా కుటుంబ సమేతంగా కోమటి చెరువు మినీ ట్యాంక్‌బండ్ ప్రాంతాన్ని సందర్శించారు. వేడుకల్లో పాల్గొన్న మహిళలు, చిన్నారులను ఆత్మీయంగా పలకరించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతోనే సిద్దిపేటకు స్వచ్ఛమైన గోదావరి జలాలు వచ్చాయని పేర్కొన్నారు. ఒకప్పుడు మురుగునీటితో ఉన్న కోమటి చెరువు నేడు గోదావరి జలాలతో కళకళలాడుతోందన్నారు. చెరువును అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంతో ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణంలో బతుకమ్మ వేడుకలు జరుపుకుంటున్నారని చెప్పారు. బతుకమ్మ తెలంగాణకు ప్రత్యేకమైన పండుగ అని, తెలంగాణ బిడ్డలు ప్రపంచవ్యాప్తంగా వేడుకలు నిర్వహిస్తూ మన సంస్కృతి, సంప్రదాయాలను చాటుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మను అధికారిక రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు. పూలను పూజిస్తూ ప్రకృతిని ప్రేమించే గొప్ప సంస్కృతి తెలంగాణ ప్రజలదని హరీశ్ రావు పేర్కొన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో తగ్గించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని పిలుపునిచ్చారు.

విశాల భారతి



## రివార్డులతోపాటు అవార్డులూ

# సాధించే సినిమా

నరేశ్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్‌భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రధారులుగా రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'క్రేజీ కల్యాణం'. బద్రప్ప గాజుల దర్శకుడు. బూసం జగన్‌మోహన్‌రెడ్డి నిర్మాత. ఇటీవలే విడుదలైన ఈ సినిమా థియేటర్లలో ప్రదర్శితమవుతున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఈ సినిమా సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. చిత్ర కథానాయిక అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ 'ఆడియన్స్ రెస్పాన్స్ అద్భుతంగా ఉంది. గట్స్, ప్యాషన్ ఉన్న ఇలాంటి టీమ్ ఉంటేనే, ఈ తరహా విజయాలు సాధ్యమవుతాయి. నేను కమర్షియల్ సినిమాలతోపాటు కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు కూడా చేస్తుండటం వల్ల ప్రేక్షకులకు వినోదంతో పాటు మంచి సందేశం కూడా ఇవ్వగలుతున్నా. వినోదం, సందేశం రెండూ ఉన్న సినిమా 'క్రేజీకల్యాణం'' అని పేర్కొన్నారు. దసరా పండక్కి రక్తపాతాలతో కూడిన సినిమాలతోపాటు రక్తసంబంధాల కథల్ని కూడా చూస్తామని ప్రేక్షకులు రుజువు చేశారని, భావోద్వేగాలతో ప్రతి తెలుగువాడినీ కలిపే సినిమా ఇదని, రివార్డ్స్‌తోపాటు ఈ సినిమా అవార్డులను కూడా సాధిస్తుందని అగ్రనటుడు నరేశ్ వీకే నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.